ప్రజాశక్తి

శుక్రవారం 10 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జోన్ ప్రకటనకు పదేళ్లు..

కార్యకలాపాలకు ఎన్నేళ్లో...

- వాల్తేరు రైల్వేను నిలబెట్టే చర్యలెక్కడ?
- జనరల్ మేనేజర్ పోస్టుకు 'కూటమి' ఒత్తిడి ఏది?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర విభజన హామీల్లో ఉత్తరాంధ్ర ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఇస్తామంటూ ప్రధాని మోడీ 2014లో ప్రకటించి ఊరిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ జోన్ ఇంతవరకూ ఇవ్వలేదు సరికదా 1893లో ఏర్పాటైన పురాతన, ప్రతిష్టాత్మక చరిత్ర కలిగిన వాల్తేరు రైలు డివిజన్‌ను కేంద్రంలోని బిజెపి ఎత్తిపారేసింది. దీంతో ఈ ప్రాంత ప్రజానీకంలో రాజకీయాలతో సంబంధం లేకుండానే బిజెపి తీరును ఎద్దేవా చేస్తూ వస్తున్నారు. జోన్ ప్రకటన తర్వాత ప్రధాన కార్యాలయం పనులపై ఇదే విధానాన్ని అనుసరించ కూడదని అత్యధికమంది భావిస్తున్నారు. జోన్ ప్రధాన కార్యాలయం విశాఖ కేంద్రంగా నిర్మాణం జరగడానికి రెండేళ్ళు పట్టొచ్చు.. ఇంకా ఎంత కాలం పడుతుందో చెప్పే పరిస్థితి లేకపోవడంతో తక్షణమే దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల కోసం రైల్వే భవనాలను వినియోగించేందుకు అత్యవసర నిర్ణయం కేంద్రం నుంచి వెలువడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న డిమాండ్ వినిపిస్తోంది. రైల్వేజోన్ జనరల్ మేనేజర్ పోస్టుకూడా నియామకం ఆలస్యంగా ప్రకటించిన జోన్‌లా ఉండకూడదని ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయంపై రాష్ట్రంలోని 'కూటమి' ఎంపీలు ఎలా పనిచేస్తారో చూడాల్సిందే..

కేంద్రం తీరువల్లే కొరవడిన స్పందన...

ఎన్‌డిఎతో పొత్తులో ఉన్న చంద్రబాబు 2014 నుంచీ జోన్ హామీని పదేపదే చెబుతూ వచ్చినా ఇది అమలయ్యేసరికి సరిగ్గా 10ఏళ్ల కాలం పట్టింది. న్యాయబద్ధంగా జరగాల్సిన కేటాయింపులకే ఎగనామం పెట్టేయాలని బిజెపి ప్రయత్నించింది. మొత్తానికి జోన్ ప్రధాన కార్యాలయానికి పునాదిరాయి పడింది. ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మైదానం 'ప్రజావేదిక' సభలో ప్రధాని చేతుల మీదుగా ఇది జరిగినా హాజరైన వేల సంఖ్యలో జనాల నుంచీ ఎలాంటి స్పందనా, చప్పట్లు కూడా రాలేదు. సిపిఎం, వామపక్షాలు, బిజెపియేతర పక్షాలు, ప్రజానీకం పోరాడి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వంటి సమస్యలు విశాఖను చుట్టుముట్టేయడంతో జోన్‌పై ఏముందిలే? అన్నట్టుగా జనం అంతా ముఖాలు పెట్టడం వారి వంతైంది. ఏదైనా ఒక ప్రధాన ప్రజా డిమాండ్‌ను తక్షణం సకాలంలో పరిష్కారాన్ని ప్రభుత్వం చేయలేకపోతే ఆ తర్వాత పరిష్కారం జరిగినా రైల్వేజోన్‌కు వచ్చిన స్పందనే ప్రభుత్వాలకు తప్పవన్నది స్పష్టంగా ఈనెల 8న వెల్లడైంది.

ఇంకా స్పష్టత రాని 'వాల్తేరు డివిజన్'....

వాల్తేరు రైల్వే డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షగా ఉంది. దేశంలోనే అత్యధిక సరకు రవాణా వ్యాపారం ద్వారా రూ.10వేలకోట్లకు పైగా వాల్తేరు డివిజన్ ఆదాయాన్ని పోగు చేస్తోంది. కెకెలైన్, కెఆర్‌లైన్ ఈ రెండూ కీలకంగా వాల్తేరు రైల్వేలో గుండెకాయ వంటివి. జోన్ ప్రకటన చేసి జోన్ కార్యకలాపాలు ప్రారంభం కాకుండానే వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసిన ఘన చరిత్ర కాషాయ నేతలైన ప్రధాని మోడీది. వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో మన రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టు, గంగవరం పోర్టు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆయిల్ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఇలు విశాఖ కేంద్రంగా ఉన్నందున ఈ ఆదాయం వస్తోంది. అత్యంత బలీయమైన ఉద్యోగ, కార్మిక శక్తి 11వేల మంది జివిఎంసి పరిధిలో ఉద్యోగులు వాల్తేరు రైల్వేలో కొండంత బలం. దక్షిణ కోస్తా

మిగతా 2లో..

జగదాంబ జంక్షన్ ప్రాంతంలో ర్యాలీ చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

వెల్లువెత్తిన నిరసనలు

విశాఖ స్టీల్‌పై ప్రస్తావించని మోడీ, చంద్రబాబు, పవన్‌పైనా, అనకాపల్లి జిల్లాలో నిర్బంధాలపైనా ఆగ్రహ జ్వాలలు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని, సెయిల్ విలీనం చేస్తామనిగానీ ప్రధాని నరేంద్రమోడీ కనీసం ప్రస్తావించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సిపిఎం ఆధ్వర్యాన విశాఖలో పలుచోట్ల నిరసనలు తెలిపారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన జగదాంబ జంక్షన్ నుంచి లేపాక్షి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యాన పాతగాజువాక జంక్షన్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన, పెందుర్తిలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. మధురవాడలో ర్యాలీ, రాస్తారోకో, తాటిచెట్లపాలెంలో నిరసన తెలిపారు. మోడీ విశాఖ పర్యటన సందర్భంగా సిపిఎం నాయకుల గృహ నిర్బంధించి, అరెస్టులను, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పరిశ్రమలు వద్దని, భూములు తీసుకున్న రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని ఆందోళన చేసిన రాజయ్యపేట గ్రామస్తులపై నిర్బంధం ప్రయోగించడాన్ని నిరసిస్తూ అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు.

వార్తలు 8లో..

ముగిసిన ఎపి డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్

వార్త మెయిన్‌లో..

పోర్టు హాస్పిటల్ ప్రయివేటుకొద్దు

వార్త 4లో..

హెచ్‌ఎంపివిపై పూర్తి అప్రమత్తత

వార్త 4లో..

ప్లాస్టిక్ రహిత విశాఖ లక్ష్యం

వార్త 3లో..

సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి పండగ నేపథ్యంలో విశాఖపట్నం నుండి వివిధ ప్రాంతాలకు రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఐదు రోజులు పాటు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు ప్రతి రోజూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం నుండి హైదరాబాద్‌కు 20 బస్సులు, రాజమండ్రి, విజయవాడకు 40 బస్సులు, కాకినాడకు 20 బస్సులు, విజయనగరం, పాలకొండ,పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాలకు 830 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు, అధికారులు, సూపర్‌వైజర్లు 24 గంటలు బస్సుస్టేషన్‌లో ఉండి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

తిరుమల తొక్కిసలాట ఘటనతో...

విశాఖ, నర్సీపట్నంలో విషాదఛాయలు

భర్త, కుమారునితో శాంతి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-యంత్రాంగం

తిరుమల తిరుపతి దేవస్థానం వైకుంఠ ఏకాదశి టోకెన్ల పంపిణీలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో విశాఖ నగరానికి చెందిన ముగ్గురు మహిళలు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పెద్దబొడ్డేపల్లికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందడంతో ఆయా ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి కంచరపాలెం ఇందిరానగర్-5కు చెందిన సుమారు 15 మంది వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్లారు. బుధవారం జరిగిన తొక్కిసలాటలో ఈ ప్రాంతానికి చెందిన కండిపల్లి శాంతి (35) మృతిచెందారు. ఆమె భర్త వెంకటేష్ కంచరపాలెం మెట్ట వద్ద ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వీరంతా తిరుపతి వెళ్లారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద వచ్చిన బంధుమిత్రులతో ఆమె విడిపోయి జనంలో చిక్కిపోయారని, ఒక్కసారిగా జరిగిన తొక్కిసలాటలో ఆమె మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని కాలనీవాసులు చెబుతున్నారు. శాంతి ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ ఉండేదని గుర్తుతెచ్చుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

జివిఎంసి 43వ వార్డు పరిధి వెంకటేశ్వరకాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి (38) ఈ ప్రమాదంలో మృతిచెందారు. లావణ్యస్వాతికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త సూరిశెట్టి సతీష్ సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీధిలో అందరితో ఎంతో సరదాగా, ఆప్యాయతగా ఉండిన లావణ్యస్వాతి మృతి చెందిందని తెలియడంతో కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. లావణ్య స్వాతి కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పరామర్శించి ఓదార్చారు.

భర్త, పిల్లలతో లావణ్యస్వాతి (ఫైల్‌ఫోటో)

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం రామాలయం ప్రాంతానికి చెందిన జి.రజని (47) ఈ ప్రమాదంలో మృతి చెందారు. రజని భర్త జి.లక్ష్మణరెడ్డి (51) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆమెకు జి.హర్షవర్ధన్ (21) కుమారుడు ఉన్నాడు. మృతురాలు రజని, ఆమె

మిగతా 2లో..

18న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఈ నెల 18న జరగనుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి గురువారం తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరంలె కొనసాగుతుందని, సభ్యులు,అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి..

జోన్ ప్రకటనకు పదేళ్లు..

కార్యకలాపాలకు ఎన్నేళ్లో...

రైల్వేజోన్ వచ్చినట్టే వచ్చి డివిజన్ లేకపోతే ఢిల్లీకి నాలుగు అదనపు రైళ్లు, మరో రెండు కొత్త లైన్లు వస్తాయి తప్ప వాల్తేరు పరిధిలోని సిబ్బందిని రాయగడలోకి కొంతమందిని, 450 కి.మీ దూరం ఉన్న విజయవాడ డివిజన్‌లోకి కొంతమందిని సర్దేసే కుటిల యత్నాలకు కేంద్రంలోని బిజెపి పాల్పడగా ఉద్యోగ, కార్మిక, సిపిఎం, వామపక్షాలూ వ్యతిరేకిస్తూ పోరాడుతున్నాయి. డివిజన్‌ను నిలబెట్టుకుని వాల్తేరును ముక్కలు కాకుండా జోన్‌ను సాధించుకోవాల్సిన సమయం ఈ ప్రాంత ప్రజల తల ఎదుటే సవాల్‌గా నిలిచి ఉంది.

తిరుమల తొక్కిసలాట ఘటనతో...

విశాఖ, నర్సీపట్నంలో విషాదఛాయలు

భర్త కుమారుడితో కలిసి తిరుమల వెళ్లినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు.

నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్దబొడ్డేపల్లికి చెందిన బొడ్డేటి నాయుడుబాబు (55) ఈ ప్రమాదంలో మృతిచెందారు. ఆయన ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తిరుమల తిరుపతి వెంకన్న స్వామి దర్శనార్థం ఏటా వెళ్తుంటాడని ఈ ఏడాది ఇలా జరిగిందని రోధిస్తున్నారు. నాయుడుబాబు బీరువాల షాపులో పనిచేస్తున్నాడు. నాయుడుబాబుకు భార్య, కుమార్తె ఉన్నారు. వైకుంఠ ద్వారం దర్శనం నిమిత్తం చెట్టుపల్లి గ్రామానికి చెందిన అతని స్నేహితుడు, భార్య మణికుమారితో కలిసి వెళ్లారు. నాయుడుబాబు మృతిచెందిన విషయాన్ని మణికుమారి ఫోన్‌లో చెప్పడంతో ఆయన ఇంటి వద్ద విషాదఛాయలు అలముకున్నాయి.

బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు కోరారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం సామాజిక రాజకీయ చైతన్య సమావేశం గురువారం ఆంధ్ర యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ మండెం సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేసన శంకర్రావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురికి ఉన్నత పదవులు అప్పగించి న్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో బీసీలకు కల్పిస్తున్న 33 శాతం రిజర్వేషన్లను 39 శాతానికి పెంచాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భవిష్యత్తులో జరగబోయే ఉద్యోగ నియామకాలలో ఉత్తరాంధ్ర బీసీ కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ఎయు వీసీ, రిజిస్ట్రార్లకు, విజ్ఞాపనలు అందజేయున్నామని తెలిపారు. కార్యక్రమం అనంతరం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మండెం సుభాష్ చంద్రబోస్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పూర్ణ చంద్రరావు, క్రాంతి కుమార్, గొర్లె శ్రీనివాసులునాయుడు, రాజు గౌడ్, హేమంత్, పీతాని ప్రసాద్, శ్యాం సుందర్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మూవ్మెంట్ 21 పిలుపు మేరకు ఆంధ్ర యూనివర్సిటీలో భారతదేశ తొలి ముస్లిం అధ్యాపకులు ఫాతిమా షేక్ జయంతిని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఫాతిమా షేక్ చిత్రపటానికి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ మాజీ అధ్యక్షులు డాక్టర్ బెన్నీ పూలమాల వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీ మాట్లాడుతూ, భారతదేశంలో మెజారిటీ బహుజనుల విద్య కోసం ఫాతిమా షేక్ కీషి వెలకట్టలేనిదన్నారు. అట్టడుగు వర్గాల విద్య కోసం మనువాద ఉన్మాదాన్ని ఎదిరించి నిలబడిన గొప్ప మహిళ అని కొనియాడారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో ప్రధాని నరేంద్ర మోడీ రోడ్డు షోలో పర్యటించిన, ప్రసంగించిన కార్యక్రమ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రపరచాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జోన్-3లో సిరిపురం జంక్షన్ నుంచి వేంకటాద్రి వంటిల్లు మీదుగా ఎయు ఇంజినీరింగు మైదానం వరకు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీరు పివి.సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం ఉద్యమాలు

ర్యాలీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నడూ లేని విధంగా దేశంలో అన్ని తరగతుల ప్రజలు సమానత్వం కోసం ఉద్యమాలు చేస్తున్నారని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు జెవి.చలపతిరావు తెలిపారు. గురువారం ఉదయం సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, పిఒడబ్ల్యు సంయుక్తంగా ఏర్పాటుచేసిన విశాఖ నివాసకుల పోరాట దినం సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మణిపూర్, కాశ్మీరు తదితర ప్రాంతాల్లో ఎన్నడూ లేని విధంగా దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. పెట్టుబడి దారి సామ్రాజ్యవాద దోపిడీ వర్గాలే వీటికి కారణమన్నారు. సమరశీల పోరాటాల వల్లనే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పాలకులు అమ్మలేకపోయారన్నారు. ప్రజలకు సంబంధం లేకుండా పెట్టుబడిదారుల లాభాపేక్ష కోసం పాలకులు చేస్తున్నది విధ్వంసకర అభివృద్ధి అన్నారు. ఒకనాడు ఫ్యాక్టరీ వస్తే అందరికోసం అనుకునే వారని, నేడు ఫ్యాక్టరీలు వస్తే ప్రజల వినాశనానికి అన్న విధంగా తయారయ్యాయని విమర్శించారు. మానవ హక్కులను హరించే ప్రధాని మోడీ అని విమర్శించారు. పర్యావరణానికి హాని కలిగించే ఫార్మా సిటీని ప్రోత్సహిస్తూ విధ్వంసకర అభివృద్ధిని చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని, గత పాలనలో జగన్ కూడా అదే చేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకులెవరికీ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అందుకే నేడు రాజకీయ ఉద్యమాలు ఎంతో అవసరం అన్నారు.

కర్ణాటక హైకోర్టు న్యాయవాది, కార్మిక నాయకులు బాలన్ ప్రసంగిస్తూ సనాతన కార్పొరేట్ పాసిజం బిజెపి పాలనలో పెరిగిపోతుందన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి రమణమూర్తి మాట్లాడుతూ, పేదలను మరింత పేదలుగా చేసే విధానాన్ని పాలకులు అవలంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, ఎంఎన్ఎస్ఎస్ నాయకులు ఇ.లక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు టి.శ్రీరామ్మూర్తి, వై.కొండయ్య, ఎస్వీ.రమణ, ఎం.వెంకటేశ్వర్లు, కెవి.రమణ, కె.రవి, ఎస్.రాజశేఖర్ ప్రసంగించారు.

సదస్సు అనంతరం రైల్వే న్యూ కాలనీ సుబ్బలక్ష్మి కల్యాణ మండపం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాలనీలను సందర్శించి సమస్యల పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

తొక్కిసలాట బాధాకరం

ప్రజాశక్తి : యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని రాష్ట్ర కో-ఆపరేటివ్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుపతి ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. నిన్న మోదీ పర్యటనలో సుమారు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. వీటివల్ల మూడు నుంచి నాలుగు లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. గతంలో శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులకే మళ్లీ చేశారని వైసిపి నాయకులు చెప్పడాన్ని ఖండించారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అమర్‌నాథ్ ఏమి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగితే కమీషన్లు వసూలు చేసుకొనే అమర్‌నాథ్‌కు చంద్రబాబును, పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గొంపా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిరుమల ఘటన విచాకరం : గుడివాడ

ఎంవిపి కాలనీ : తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన ఘటన దురదష్టకరమని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ హత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.20 లక్షలు ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వైసిపి తెచ్చిన గ్రీన్ హైడ్రోజన్ బల్క్ డ్రగ్ పార్కులను కూటమి ప్రభుత్వం తెచ్చినట్టు విశాఖలో జరిగిన ప్రధాని మోడీ సభలో శంకుస్థాపన చేశారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మోడీతో ఒక్క మాట కూడా మాట్లాడించలేకపోయారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పక్కనపెట్టి ప్రయివేటుగా పెట్టబోయే స్టీల్‌ప్లాంట్‌కు మద్దతు పలికారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన మురళీనగర్‌కు చెందినా వాసుదేవ్ ప్రజాపతి, అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన పోలిశెట్టి వెంకట నాగ మాధవి, మర్రిపాలేనికి చెందిన కోన శంకరరావు లకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పోలీస్ కమిషనర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

వెంకటేశ్వర స్వామికి వైకుంఠ ఏకాదశి శోభ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం శ్రీ వెంకటేశ్వర మెట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు, ఉత్తర ద్వార దర్శనం ఘనంగా జరుగుతుందని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి.వి.రమాబాయి తెలిపారు. శుక్రవారం తెల్లవారుఝామున ఒంటిగంట నుండి ఆరాధన, నివేదన, తిరుప్పావై సేవా కాలం, ధనుర్మాస అర్చనలు, నీరాజన మంత్రపుష్పం పల్లకి సేవ, 3 గంటలకు ఉత్తర ద్వార దర్శనం, శ్రీ స్వామివారి మండపంలో ప్రథమ అర్చన, సహస్రనామార్చన ఉంటాయని వివరించారు. శనివారం కూడారై ఉత్సవం, 12న గోదాదేవి, శ్రీ స్వామి వారిని కల్యాణ దంపతులుగా అలంకరణ, 13న భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కల్యాణం, 14న మకర సంక్రాంతి వేడుకలు, 15న కనుమ పండగ సందర్భంగా తిరువీధి, 16న ముక్కనుమ సందర్భంగా పరస మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వందే భారత్ రైళ్లకు కోచ్‌ల పెంపు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విశాఖపట్నం -సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన నాలుగు అదనపు కోచ్‌లను ఈ నెల 11 నుంచి ఏర్పాటుచేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్‌కు నూతన కోచ్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ డివిజనల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. దీంతో ఈ వందేభారత్ రైళ్లు రెండు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్, 18 చైర్ కార్ కలుపుకొని మొత్తం 20 కోచ్‌లతో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

IN THE HON'BLE COURT OF II ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM A.S.127/2023

Between:
Sheik Mahaboob Subhani & 2 others ...Appellants
And:
Y. Eswara Naidu & others ...Respondents

NOTICE

To,
R-1: Yerra Eswara Naidu,
S/o. Ramnaidu, Hindu,
aged 45 years, R/at D.No.1-2-18/1,
Vivekananda Colony,
Akkireddy Palem,
BHPV Post, Visakhapatnam.
R-3: Sri Pusapati Sanyasi Venkata Vijaya Rama Raju,
S/o. Late Seetharama Chandra Raju, Hindu, aged 50 years,
R/at D.No.10-5-112, Ward No.5,
Bheemunipatnam Muncipality,
Bheemunipatnam Mandalam & Taluka, Visakhapatnam.

Please take notice that the above-named appellants filed the above appeal against the decree and Judgment passed in O.S.04/2013 dated 21-03-2023 by the I Addl. Senior Civil Judge, Visakhapatnam and the above matter stands posted to **28-01-2025** for your appearance. Both of you have to attend either in person or through your counsel on that day at about **10:30 A.M** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.

(By the Order of the Hon'ble Court)
V.S. PAVAN
Advocate for Appellants,
Visakhapatnam.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM E.P. 16/2021 O.S. 5/2016

Between:
Rikka Venkata Satya Lakshmi ... Plaintiff
And:
Gondesi Ramanamma ... Defendant

To,
J.Dr
Gondesi Ramanamma,
W/o Yerukunaidu,
R/o D. No. 21-49-5,
R.H. Colony, Peda Gantyada,
Gajuwaka,
Visakhapatnam District.

Whereas the above named D.Hr filed the above E.P. to conduct public auction and for the sale of the E.P. shedule property to serve the notice under order 21 rule 64 notice and you are hereby directed to appear before the above mentioned court on **04-02-2025 by 10:30 A.M.** Failing which the matter will be heard and decided ex-parte.

(By order of the court)
Sri. K.S.M. SUDHAKAR
Advocate,
Bheemunipatnam.

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM A.S.128/2024

Between:
Sri Thottempudi Devakinandana ...Appellant
And:
M/s. Somi Estates and Private Limited,
Rep. by its Managing Director,
Sri Somi Venkata Ramana & others ...Respondents

NOTICE

To,
R-1:M/s.Somi Estates and Private Limited
Rep. by its Managing Director
Sri Somi Venkata Ramana,
S/o. late Rama Rao, Business,
R/at D.No.50-22-1, TPT Colony,
Seethammadhara, Visakhapatnam
R-2: M/s. V.R. Townships and Housing Private Limited,
Rep. by its Managing Director
Sri Somi Venkata Ramana,
S/o. late Rama Rao, Business,**Rest-do-**
R-3: Sri Somi Venkata Ramana,
S/o. late Rama Rao, Hindu,
aged 60 years, Managing Director of M/s. Somi Estates and Private Limited and M/s. V.R. Townships and Housing Private Limited, R/at **Rest-do-**

Please take notice that the above-named appellant filed the above appeal against you under Order XLI Rule 1 of C.P.C against the decree and order passed by the Hon'ble Principal Senior Civil Judge Court at Visakhapatnam in O.S.1000/2016 and the above matter stands posted to **28-01-2025** for your appearance. So you are hereby informed to appear before the Hon'ble XII Addl. District Judge Court at Visakhapatnam on **28-01-2025** at **10:30 A.M.**,either in person or through an Advocate, failing which an exparte order will be passed against you.

(By Order of the Hon'ble Court)
BEVARA SATYANARAYANA,
BEVARA (K) DEEPTHI SREE
Advocates, Visakhapatnam.

ప్లాస్టిక్ రహిత విశాఖ లక్ష్యం

- జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్
- 'సే నో టు ప్లాస్టిక్'పై పలుచోట్ల అవగాహన ర్యాలీలు
- నగరంలోని అన్ని దుకాణాల్లో ఒకేరోజున స్టిక్కర్ల అతికింపు

అవగాహన ర్యాలీలో జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార: విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యమని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. గురువారం మూడవ జోన్, 27వ వార్డు ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగానున్న సాయికృష్ణ పార్లర్ దుకాణంలో వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, జివిఎంసి అధికారులతో కలిసి 'సే నో టు ప్లాస్టిక్" స్టిక్కర్లను అతికించి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ మహమ్మారిని నగరం నుంచి సమూలంగా తరిమికొట్టడమే లక్ష్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ఈ నెల ఒకటినుంచి పూర్తిగా నిషేధించామని, దీనిపై ప్రజలకు, వినియోగదారులకు, ఉత్పత్తి, అమ్మకం, సరఫరాదారులకు అవగాహనపరుస్తూ, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. నగరంలో 598 సచివాలయాల పరిధిలో వ్యాపార లైసెన్సులు కలిగిన 50 వేల దుకాణాలు, వాణిజ్య సముదాయాలలో గురువారం ఒకే రోజున అందరు వార్డు కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పిలు, స్వయంశక్తిసంఘాల మహిళలతో సమూహంగా వెళ్లి 'సే నో టు ప్లాస్టిక్' అనే స్టిక్కర్లను అతికించి అవగాహన కల్పించే బృహత్తక కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం జూమ్ యాప్ ద్వారా వార్డు కార్యదర్శులతో మాట్లాడుతూ సంక్రాంతి లోగా అన్ని దుకాణాలలో స్టిక్కర్లను అతికించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యపరచాలన్నారు. అనంతరం 'ఐ సపోర్టు ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్', 'సే నో టు ప్లాస్టిక్" నినాదంతో ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, జోనల్ కమిషనరు కె.శివప్రసాద్, ఎఎమ్ఒహెచ్. బి.ప్రసాదరావు, ఎపిడి రాము తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ములగాడ: జివిఎంసి 59వ వార్డు గాజువాక డిపో, ఐఎన్ఎస్ ఏక్ శిల వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రాము, కూటమి నేతలు పుర్రె సురేష్ యాదవ్, శ్రీను, శంకర్, పూడి భాస్కర్, ఊరుకుటి హరి, దేవర ఈశ్వరరావు, ప్రసాద్, ఊరుకుటి మహేష్, గురుమూర్తి, సతీష్, జివిఎంసి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు ఉందని,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. గురువారం 5, 6 వార్డుల్లో జివిఎంసి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఆరోవార్డులో టిడిపి, జనసేన అధ్యక్షులు దాసరి శ్రీను, సంతోష్‌నాయుడు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.

మాధవధార : జివిఎంసి 50వ వార్డు మాధవధార తదితర ప్రాంతాల్లో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి సుధాకర్ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. వ్యాపారులు, ప్రజలు సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని పిలుపునిచ్చారు. జివిఎంసి, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : ప్లాస్టిక్ సంచులకు పూర్తిగా స్వస్తి చెప్పాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ' సే నో టు ప్లాస్టిక్' ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ రహిత విశాఖగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వం, జివిఎంసి చర్యలకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలన్నారు. ప్రత్యామ్నాయంగా నార, గడ్డ సంచులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పొలిమేర సీతారాం, బొడ్డేటి విజయ్, కంపర ఆనంద్, కండేపల్లి కనకకుమార్, మళ్ల నాయుడు బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేనెల 10 నుంచి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -తగరపువలస: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 10 నుంచి 19వ తేదీ వరకు ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కళాశాలలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డా. బి మురళీకృష్ణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు

రక్తదానంతో బహుళ ప్రయోజనాలు



రక్తదానం చేస్తున్న విమ్స్ ఉద్యోగులు)

ప్రజాశక్తి - ఆరిలోవ : రక్తదానంతో ప్రాణదాతలు కావాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం విమ్స్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విమ్స్ ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈసందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ, అవసరానికి రక్తం లభ్యం కాక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం చేయటం వలన వ్యక్తిగతంగా ప్రయోజనాలున్నాయన్నారు. ప్రతి ఆరునెలలకోసారి రక్తదానం చేయడం వల్ల కొత్తరక్తం ఉత్పన్నమై, శరీరం ఉత్తేజితమౌతుందన్నారు. రక్తదానం చేసిన విమ్స్ ఉద్యోగులను అభినందించారు. విమ్స్ కార్యాలయం పర్యవేక్షణ అధికారి సత్యనారాయణ రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. విమ్స్ పరిపాలన అధికారి షేక్ బాజిత్ పాల్గొన్నారు..

80 మంది విద్యార్థుల రక్తదానం

తగరపువలస :స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో లైఫ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో కాలేజీకి చెందిన 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ షరీఫ్, కో ఆర్డినేటర్ జి చిన్నయ్య, అధ్యాపకులు,లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు

'దివీస్' సహకారంతో తాగునీటి బోరు

ప్రజాశక్తి-తగరపువలస: చిట్టివలస జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో భీమిలి మండలం, చిప్పాడ, దివీస్ సంస్థ అధ్వర్యంలో రూ.లక్ష 89 వేలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, సబ్ మెర్సిబుల్ పంప్‌ను ఎంఇఒ ఎం శివ.రాణి గురువారం ప్రారంభించారు. దివీస్ యాజమాన్యానికి హెచ్ఎం సి హెచ్ రోజామణి, ఉపాధ్యాయులు , విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, పి శేఖర్‌బాబు పాల్గొన్నారు

టిటిడి చైర్మన్‌ను తొలగించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ముక్కోటి ఏకాదశికి తిరుమల శ్రీవారి దర్శనానికి టోకన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతిపై ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి ప్రకటనలో పగాడ సంతాపం తెలిపారు. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, బాధ్యులైన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తులకు తగిన రక్షణ కల్పించడంలో టిటిడి విఫలమైందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

విశాఖ లీగల్ : తిరుమల విషాద ఘటనలో మృతి చెందిన భక్తుల కుటుంబాలను ప్రభుత్వపరంగా పరిహారమిచ్చి ఆదుకోవాలని వైసిపి లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ తెలిపారు.తిరుమల ఘటనకు బాధ్యత వహిస్తూ టిటిడి చైర్మన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.1.50కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఆరుగురు భక్తుల మృతికి కారకులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

నేరాలు ఘోరాలు

మహిళ దారుణ హత్య

నరసయ్యమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్కవరం గ్రామంలో పొలంలో వబలరెడ్డి నరసయ్యమ్మ (55) అనే మహిళ గురువారం దారుణ హత్యకు గురైంది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన వబలరెడ్డి నరసయ్యమ్మ (55), ఆమె భర్త నరసింహమూర్తితో కలిసి గురువారం పొలంలోకి వెళ్ళింది ఇరువురు కొంతసేపు గడ్డి కోశారు. తరువాత భర్త నరసింహమూర్తి ఊర్లోకి వెళ్లి వస్తానని వెళ్లారు. తిరిగి వచ్చేసరికి నరసయ్యమ్మ చెరుకు తోటలో హత్యకు గురై ఉంది. దీనిపై భర్త నరసింహమూర్తి చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సిఐ అప్పలరాజు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నరసయ్యమ్మ పొలంలో గడ్డి కోస్తుండగా దుండగులు ఆమెను పక్కనున్న చెరుకు తోటలోకి తీసుకువెళ్లి కత్తితో గొంతు కోసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును అపహరించునట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మహిళను అత్యంత దారుణంగా హత్య చేయడంతో ఒక్కసారిగా లక్కవరం పరిసర గ్రామ ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో సోముదేవునిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ఓ విద్యార్థినిగురువారం ఉదయం మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. లింగరాజుపాలెం గ్రామంలోనున్న మహాత్మాగాంధీ జ్యోతిలాల్ పూలే బాలికల హాస్టల్లో పాము యోగిత పదవ తరగతి చదువుతుందన్నారు. సహ విద్యార్థులతో కలసి సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్తుండగా దుర్ఘటన జరిగిందన్నారు. తన సోదరుడు ఆటోలో ముందు భాగాన కూర్చున్న యోగిత గుంతల రోడ్డులో ముందుకు పడి పోవడంతో తలకు గాయమైంది. దీంతో అదే ఆటోలో పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా, ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక సిఐ లొడ్డు రామకృష్ణ పరిశీలించి విద్యార్థినుల నుండి సమాచారం అడిగి తెలుసుకున్నారు.కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : గంజాయి కేసులో నిందితుడిపై నేరాభియోగం రుజువుకావడంతో మూడేళ్ల జైలు, రూ.పది వేల జరిమానా విధిస్తూ గురువారం గంజాయి కేసుల ప్రత్యేక జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎం వెంకటరమణ తీర్పు చెప్పారు. కేసులో వాదనలు వినిపించిన గ్రేడ్‌వన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జిఎస్ఎన్‌వి. ప్రసాద్ తెలిపిన వివరాలివి. ఆరిలోవ ప్రాంతానికి చెందిన పుక్కాల శ్రీను 2018 డిసెంబర్ 7న ముడుసర్లోవ స్టీల్ డెవలప్మెంట్ సెంటర్ వద్ద, నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులకు ఆరు కిలలో గంజాయితో పట్టుబడ్డాడు. దీనిపై అప్పటి ఆరిలోవ సిఐ పి.పాపారావు అరెస్టు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టుకు సమర్పించిన నేరాభియోగపత్రం ఆధారంగా విచారణ జరిపిన న్యాయమూర్తి, నిందితుడిపై అభియోగం రుజువు కావడంతో శిక్ష విధించారు.

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని గర్నికం గ్రామానికి చెందిన కేశంశెట్టి రమణకు చెందిన రెండు వరి కుప్పలు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఖాళీ బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు రావికమతం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా మంటలను అదుపు చేశారు. రెండు వరి కుప్పలు ఖాళీ బూడిదయ్యాయి. దీంతో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు పలువురు అంచనా వేస్తున్నారు. భారీ అగ్ని ప్రమాదంతో మంటలు ఎగిసి పడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వరి పంట కుప్పలు ఖాళి పోవడంతో ఈ ఏడాది పాటు బతుకు జీవనం పోయిందని బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అధికారులు, స్పందించి ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటు కావద్దు

- అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకు అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన గురువారం విశాఖ పోర్టు చైర్మన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వివిఎస్. పద్మనాభరాజు మాట్లాడుతూ, పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇవ్వాలనే టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌ను ప్రయివేటీకరణ చేయొద్దని 101 రోజులుగా కార్మికులు ఆందోళన సాగిస్తున్నారని తెలిపారు. పోర్టు సొంత నిధులతోనే హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. 40 వేల మంది కార్మిక ఆరోగ్య భద్రతను ప్రయివేటు చేతుల్లో పెట్టడం తగదన్నారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బి.సిహెచ్ మసేన్ మాట్లాడుతూ, పోర్టుల్లో పిపిపి, బిఒటి విధానాలు విఫలమయ్యాయని గతంలో కాగ్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. గత అనుభవాల దృష్ట్యా పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇవ్వొద్దని డిమాండ్‌చేశారు. సిఎస్‌టియుఐ నాయకులు ఎన్.కనకారావు మాట్లాడుతూ, ఉద్యోగులు, కార్మికులు పొందే వైద్యానికి కూడా లాభనష్టాలు బేరీజు వేయడం దుర్మార్గం అన్నారు. విశాఖ పోర్టు సొంత నిధులతోనే మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్ మిషనరీలను,స్పెషలైజ్డ్ స్టాఫ్‌ను, నాణ్యమైన మందులను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ సీనియర్ నాయకులు కె.మంగయ్య నాయుడు, సిఐటియు నాయకులు కె.సత్య నారాయణ, జె.సత్య నారాయణ, రామలింగేశ్వర రావు, ఐఎన్‌టియుసి నాయకులు జి.చంద్రరావు, బిఎంఎస్ నాయకులు బి.రవిశంకర్ మాట్లాడారు.

పోర్టు చైర్మన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాలు

బకాయిలు చెల్లించాలని
నేడు షిప్‌యార్డు పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరుతూ ఈనెల 10న శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. హిందుస్థాన్ షిప్‌యార్డులో 35 నుంచి 40ఏళ్లపాటు విధులను నిర్వర్తించి,ఉద్యోగ విరమణ తర్వాత అతి తక్కువ పెన్షన్‌తో దుర్భర జీవితం గడుపుతున్న పెన్షనర్లకు రావాల్సిన బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులకు కోట్లు ఖర్చు చేస్తున్న షిప్‌యార్డు యాజమాన్యం, విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ చెల్లించడానికి నిరాకరించడ దుర్మార్గమన్నారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పర్సన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఐటి ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

- సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శికుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ మధురవాడ : రుషికొండ ఐటి హిల్‌లోని కంపెనీల ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలను యాజమాన్యం ఇవ్వకపోవడం దుర్మార్గమని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. విశాఖను ఆంధ్రాకు ఆర్థిక రాజధాని చేస్తామని ప్రకటిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఐటి సెక్టార్‌లోని ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఐటి ఉద్యోగులకు జీతాలు ఇప్పించాలని,. వారి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఐటి ఉద్యోగుల పోరాటానికి సిఐటియు ప్రత్యక్షంగా మద్దతు తెలిపి, ఉద్యమంలో ముందుంటుందని స్పష్టం చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -విశాఖపట్నం : స్థానిక ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ కేంద్రంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఏడాది డిప్లొమా కోర్సులో శిక్షణకు ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్ల ఎఐఐఎల్ఎస్‌జి రీజనల్ డైరెక్టర్ బీరేంద్రసింగ్ ఫర్తియాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రజారోగ్య విభాగానికి సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, శానిటరీ విభాగానికి సంబంధించిన ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని, ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో గీతం వైద్యశిబిరాలు

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వాతి

ప్రజాశక్తి -మధురవాడ: కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) సహకారంతో అనకాపల్లి జిల్లాలోని వి.మాడుగుల, చీడికాడ, అల్లూరి జిల్లా జి.మాడుగుల, పాడేరు మండలాలలో గురువారం వైద్యశిబిరాలను నిర్వహించినట్లు గీతం ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ స్వాతి చిక్కాల తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కమ్యూనిటి రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్ఆర్‌సి) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన నాలుగు మండలాల్లోని గిరిజన గ్రామాలలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం పట్ల అవగాహన కలిగించడంతో పాటు ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు. గీతంతో పాటు అరోహన్ ట్రైబల్ సొసైటి, కృషి విజ్ఞాన కేంద్ర, రోటరీ విశాఖ పెరల్ సిటి సంయుక్తంగా జిమ్‌సర్ ఆసుపత్రి వైద్యులతో కలిసి వైద్యశిబిరాలను నిర్వహించి ఉచిత మందులు అందజేశామన్నారు. అలాగే స్థానిక గిరిజనులకు తాగు నీటిని శుభ్ర పరుచుకునే విధానం, స్థానికంగా లభించే ఉత్పత్తులతో ఉపాధిని పెంచుకొనే పద్దతులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షించుకొనే పద్ధతులను వివరించినట్లు తెలిపారు.

గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించాలి

యాత ప్రజాప్రతినిధులకు సత్కారం

ప్రజాశక్తి -ఆనందపురం: గీత కార్మికులకు మద్యం షాపులను కేటాయించి ఆదుకోవాలని యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గీత ఉప కులాల కన్వీనర్ ఆంగటి రాము కోరారు. గురువారంభీమిలి నియోజకవర్గం కల్లుగీత సహకార సంఘాల అధ్యక్షులతో ఆనందపురం కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, వైసిపి పాలనలో గీత కార్మికులకు సంక్షేమ పథకాలు అందక తీరని అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపులో గీత కార్మికులకు వాటా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇటీవల నీటి సంఘాల ఎన్నికలలోకాపులుప్పాడ నీటి చానల్ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గండిబోయిన రమణ, గొలుసు శ్రీను, శ్రీశైలం, రాష్ట్ర నాయకులు హరి ప్రసాద్ ఘనంగా సన్మానించారు. చిట్టిబోయిన రాము అధ్యక్షతన కార్యక్రమంలో రీసు రమణ, గండిబోయిన రమణ, కాకర ఎల్లారావు, హరి ప్రసాద్, కొలుసు శ్రీను, గండిబోయిన సత్యం, సంఘాల అధ్యక్షులు మెంబర్లు పాల్గొన్నారు .

జర్నలిస్టుల డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మాధవధార : మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండే జర్నలిస్టుల సేవలను కొనియాడారు. జర్నలిస్ట్ లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు అసోసియేషన్ సభ్యులను అభినందించారు.

డైరీ ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

కేలండర్ ఆవిష్కరిస్తున్న భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 70వ వార్డు చట్టివానిపాలెంభాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ 2025లో విద్యార్థులు క్రమశిక్షణ, చదువులో రాణించాలని కోరారు తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల పేరుతో ముద్రించిన కేలండర్‌ను ఆవిష్కరించి, సిబ్బందికి, తల్లిదండ్రులకు అందజేశారు.

రోడ్డు నిర్మాణంపై హర్షం

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని తర్లువాడ గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో రోడ్డు పనులను ఎంపిపి మజ్జి శారద ప్రియాంక ప్రారంభించారు. తర్లువాడ గ్రామం నుండి బంగారమ్మ గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపడుతుండడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.మజ్జి వెంకట్రావు నాయకులు ,కోరాడ ఆదినారాయణ పాల్గొన్నారు

'హెచ్‌ఎంపివి'పై పూర్తి అప్రమత్తత

- వైరస్‌పై ఆందోళన వద్దు : విమ్స్ డైరెక్టర్ రాంబాబు
- విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు
- మందులు, ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేసిన అధికారులు



హెచ్‌ఎంపివి వార్డు పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : దేశంలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపివి) కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కోవిడ్‌లో వేలాది మందికి వైద్యం అందించిన విమ్స్ ఆస్పత్రి యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన (నిమిషంలో 60 లీటర్ల ఆక్సిజన్ అందించే హై ఫ్లోన్యాసల్ కాన్యూలాను కూడా సిద్ధం చేశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వార్డును విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు సందర్శించి, ఏర్పాట్లపై పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ వైరస్‌పై వస్తున్న వదంతులు నమ్మొద్దని, ఇది ప్రాణాంతకం కాదని, సాధారణ ఫ్లూవైరస్ లక్షణాలే కనిపిస్తాయని స్పష్టం చేశారు.

వైరస్ లక్షణాలు..

జ్వరం, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటివి వైరస్ లక్షణాలు. వైరస్ సోకిన వారికి రిబావిరిన్, అజిత్రో మైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది. హైరిస్క్ గ్రూపు లకు చెందిన హెచ్‌ఐవి, క్షయవ్యాధి, డయాలసిస్ రోగులు, సిఒపిడి, ఆస్తమా రోగులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు హెచ్‌ఎంపివి వైరస్ బారిన పడే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చేతులు పరిశుభ్రత పాటించాలి. మాస్కులు ధరించాలి. బహిరంగ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం చేయకూడదు.వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుని, పాజిటివ్‌గా తేలితే ఐసోలేషన్‌లో తగు వైద్యం పొందాలి

ఆందోళన వద్దు

హెచ్‌ఎంపివి సాధారణ జలుబు లాంటిది. భయాందోళన అవసరం లేదు. కోవిడ్ మాదిరిగానే జాగ్రత్తలు తీసుకుంటేనే సరిపోతుంది. పిల్లలు, వృద్ధులు, హైరిస్క్ గ్రూపు వారు అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు చర్యల్లో భాగంగా విమ్స్ ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును అవసరమైన మందులతో ఏర్పాటు చేశాం.

-డాక్టర్ కె..రాంబాబు, విమ్స్ డైరెక్టర్

క్లాప్ వాహనాల లోడర్లకు జీతాలు చెల్లించాలి

జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్‌లో క్లాప్ వాహనాల్లో పనిచేస్తున్న లోడర్స్‌కు నాలుగు నెలల జీతాలు లేకపోవడంతో గురువారం వారు పనులను నిలుపుదల చేసి నిరసన చేపట్టారు. జీవీఎంసీ కార్యాలయం వద్ద వినూత్నంగా వంటలు చేసుకోని తిన్నారు. పండగ లోను పస్తులు ఉండాలా వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పండగ పూట కూడా జీతాలు ఇవ్వకుండా మొండి కేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆందోళన చేస్తున్నామని తెలిపారు. దీనిపై పలుమార్లు జీవీఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్‌కు విన్నవించినప్పటికీ స్పందించ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర రావు మాట్లాడుతూ జీవీఎంసీ కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు తమ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పేర్లతో కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు.ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోడర్స్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలన్నారు. ఈ ధర్నాకు కాంటాక్ట్ యూనియన్ నాయకులు ఎర్రంశెట్టి శివకుమార్, వై యేసు రాజు, ఎర్రశెట్టు ఓం శివ, పొట్నూరి గోవిందు, సిఐటియు వివి శ్రీనివాసరావు, శివకుమార్ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ప్రసాదు, కార్యదర్శి భారతి, తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మోడల్ పేపర్లు అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ ఆధ్వర్యాన టెన్త్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అచ్చుతాపురం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలో పలు ఉన్నత పాఠశాలలకు యుటిఎఫ్‌చే తయారు చేయబడిన పదవ తరగతి మోడల్ పేపర్లు, మెటీరియర్లను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మద్దిల నానాజీ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలగా యుటిఎఫ్ మోడల్ పేపర్లు విద్యార్థులకు ఉపాధ్యాయులకు చక్కగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రవి కుమార్, వర్మ, మారిశెట్టి వెంకటఅప్పారావు, షేక్ సలీం, జిఎస్ ప్రకాష్, కొండబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం-1 సెక్షన్ పరిధిలోని 33/11కెవి సబ్బవరం సబ్ స్టేషన్‌లో న్యూ బేకర్స్ కన్స్ట్రక్షన్ వర్క్ కారణంగా శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని సబ్బవరం, తవ్వవనిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ పంచాయతీలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ అర్చకుడిపై దాడి దురదృష్టకరం

ప్రజాశక్తి-వడ్డాది : గుంటూరు జిల్లా పొన్నూరు శంకరమఠం బజార్లోని నాగేంద్ర స్వామి దేవాలయంలో అర్చకత్వం చేస్తున్న నూతలపాటి నాగేశ్వరశర్మపై అగంతకుడు అమానుషంగా భౌతిక దాడి చేయడంతో పాటు దుర్భాషలాడటాన్ని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యదర్శి సుసర్ల హరి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆలయ అర్చకుడిపై దాడి చేయడం దురదృష్టకరమన్నారు. అర్చకులపై ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు, రేపు 'డావిన్సీ ఉత్సవ్'

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలోని డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో జనవరి 10, 11 తేదీలలో 'డావిన్సీ ఉత్సవ్' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, పాఠశాల ప్రధాన ఆచార్యులు మీనా మిశ్రా తెలిపారు. ఈ మేరకు డావిన్సీ స్కూల్లో గురువారం విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ చదువుతోపాటు శారీరక, మానసిక, సాంస్కృతిక నైపుణ్యాలను పెంపొందించాలని సదుద్దేశంతో ఈ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నర్సరీ నుంచి 2వ తరగతి వరకు నాలుగు హౌసెస్‌గా విభజించబడి వారిలో వారికే ఇంటర్నల్ స్పోర్ట్స్ కాంపిటీషన్, ఎడ్యుకేషన్లో క్విజ్, రామానుజమ్ టాలెంట్ టెస్ట్స్, డావిన్సీ సైంటిస్ట్స్ వంటి అనేక విద్యాపరమైన పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శారీరక దృఢత్వాన్ని పెంపొందించే ఫిజికల్ ఫిట్నెస్ వంటి కార్యక్రమాలతో క్రీడా వాతావరణం తెలియజేసేలా ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో జోడించి, విద్యార్థుల ప్రతిభ నైపుణ్యాలను తల్లిదండ్రుల సహకారంతో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కర్రి సుందరయ్య

విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు

భీమిలి మండలం మజ్జిపేట స్కూల్‌లో భోగి మంటలు

వెంకటేశ్వరస్వామి వేషధారణలో డాలీ ప్లే స్కూల్ చిన్నారులు

నక్కపల్లి మండల రాజయ్యపేట స్కూల్‌లో..

ప్రజాశక్తి -మధురవాడ

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం అట్టహాసంగా జరిగాయి. ఎప్పుడూ జీన్స్,ఆధునిక వస్త్రధారణలో ఉండే గీతం బిజినెస్, టెక్నాలజీ స్కూళ్ల విద్యార్థులు పోటాపోటీగాపంచెలు, చీరలు, ఓణీలతో తెలుగుదనం ఉట్టి పడేలా సంప్రదాయ దుస్తులు ధరించి క్యాంపస్‌లో సందడి చేశారు. గీతం ప్రాంగణంలో రంగ వల్లులు దిద్దారు. గీతంలోని ఇతర దేశాలు, రాష్ట్రాల విద్యార్థులకు తెలుగు సాంప్రదాయ సంక్రాంతి అనుభూతులను మిగిల్చేలా పండగ జరుపుకున్న విద్యారుథలను విసి ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అభినందించారు.

డాలీ ప్లే స్కూల్‌లో...

గాజువాక : జివిఎంసి 87వ వార్డు కణితి కాలనీ కళింగ వీధి డాలి ప్లేస్కూల్‌లో ప్రిన్సిపల్ మాధురి, వైస్ ప్రిన్సిపల్ శిరీష, సుధా, బేబీ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిఇంచారు. సాంప్రదాయ దుస్తులు, హరిదాసు, వెంకటేశ్వరస్వామి తదితరు వేషధారణల్లో చిన్నారులు అలరించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని మజ్జిపేట జెడ్పి హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. భారతీయ సంస్కృతి ఉట్టి పడేలా పాఠశాల ఆవరణలో ముగ్గులు,భోగి మంటలు వేశారు. హెచ్‌ఎం పి ఉషారాణి,ఉపాధ్యాయులు వి బాలాజీ, నారాయణ రావు, శ్రీనివాసరావు, అప్పలరాజు, బృంద పాల్గొన్నారు.

డైట్‌లో సంక్రాంతి శోభ

రంగవల్లులు, గంగిరెద్దుల వేషధారణ, హరిదాసు కీర్తనలతో భీమునిపట్నం ప్రభుత్వ డైట్‌లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం జ్యోతికుమారి,అధ్యాపకులు ఎల్. సుధాకర్, జిజి స్ నాగేశ్వరరావు, త్రినాధరావు, మాధవి, మహాలక్ష్మి, నీలిమ పాల్గొన్నారు

డైట్‌లో హరిదాస్ వేషధారణలో..

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, పాండ్రంగి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హెచ్‌ఎం ఎం సన్యాసిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కోలాటాలు, హరిదాసు, రైతు, ఇతర వేషధారణలు ఆకట్టుకున్నాయి

ఆనందపురం : మండలంలోని ఆనందపురం, బిపి కల్లాలు హైస్కూళ్లలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సాంప్రదాయ వేషధారణలు, భోగీమంగలు, గాలిపటాల ఎగరవేతతో పండగ సందడి నెలకొంది. ముగ్గుల పోటీల్లో విద్యార్థుల తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఇఒ గంగరాజు పాల్గొని అభినందించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విశ్రాంత పిన్సిపల్ దాలిగురువులు, డాక్టర్ చందక త్రినాథ్ నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ బద్దపు బంగార్రాజు, డైరెక్టర్ కాకర సురేష్ కుమార్, ప్రిన్సిపల్ కుప్పల లహరి పాల్గొన్నారు.

రావికమతం : మరపాక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ కే సత్య సునీల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.మండలంలో రావికమతం, చినపాచిల, గుడ్డిప, మేడివాడ, కవగుంట పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలను వేస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించారు.

మాడుగుల : మాడుగులుఖఎ డిగ్రీ కళాశాల, సెంటెన్స్ పలు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి వేడుకల్లో జరిగే సన్నివేశాలను విద్యార్థులకు వివరించారు. రంగవల్లులు, భోగిమంటలు, గాలిపటాలు ఎగరవేయడం, కొత్త కుండలో పాలు పొంగించడం సాంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు అధ్యాపకులు సందడి చేశారు.

నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోహెచ్‌ఎం నారాయణరావు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. భోగిమంటలు, హరిదాసుల కీర్తనలు, భోగిపళ్ళు, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హరిదాసు, గంగిరెద్దుల వేషధారణతో విద్యార్థులు ఎంతగానో అలరించారు ఉపాధ్యాయులు డివి సన్యాసిరావు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను వాచ్‌ఎం ఎంఆర్‌వి.అప్పారావు ప్రారంభించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో అలరించారు. ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.ఉపాధ్యాయులు బి.అప్పారావు, ఆనంద్, నీలవేణి, శేష, ఆచంట రవి, ప్రసాద్, కుమారి, విద్యాకమిటీ చైర్మన్ నక్కా నాగమణి పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని జంపపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో మందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. వారు గంగిరెద్దులు, హరిదాసు, పంచకట్టు పెద్దలు, సన్నాయి వాద్యకారుడు వేషాలు వేసి ఆకట్టుకున్నారు. విద్యార్థినులు గొబ్బెమ్మ ఆటలు పాడి నృత్యాలు చేశారు. సాంప్రదాయ క్రీడా పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కెఆర్‌ఏ.నాపయుడు, బి.సత్యనారాయణ, సుధాకర్, శివ, కృష్ణారావు, శ్రీను, షబ్బీర్, సుబ్బారావు, నాగరాజు, చిట్టిరాజు పాల్గొన్నారు.

కశింకోట జెడ్పి పాఠశాలలో..

యలమంచిలి మండల జంపపాలెం పాఠశాలలో..

సిపిఎం నేతల గృహ నిర్బంధం, అరెస్టులు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా జిల్లాలోని సిపిఎం నాయకులను, కార్యకర్తలను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచడం, అక్రమంగా అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో విశాఖ ఉక్కును బలిచేసి నక్కపల్లిలో మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనకు పూనుకోవడం దారుణమన్నారు. నక్కపల్లిలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీలు ఇవ్వకుండా పోలీసులను మోహరించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కును ఉపసంహరించుకుంటామని, హైడ్రోపవర్ ప్లాంట్లకు అనుమతులు ఇవ్వడం లేదని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పూజ్యమేఘన

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకంలో భాగంగా దేవరాపల్లి పీహెచ్‌సీలో 56 మంది గర్భిణీలకు డాక్టర్ ఈ.పూజ్య మేఘన గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఐ రిస్క్ కేసులో పదిమంది ఉన్నట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. వైద్యులు చెప్పిన సూచనలు సలహాలు తప్పక పాటించాలని సూచించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారు ఐరన్ మాత్రం తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెచ్‌వి బి.లక్ష్మి, పీహెచ్‌ఎన్ సుశీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేలండర్, డైరీలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ 2025 డైరీలు, క్యాలెండర్లను అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు గురువారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర ప్రతినిధులు పెనుమత్స కృష్ణంరాజు, కోట్ని రాంబాబు, లక్ష్మణ్, సాగర్, సూరేష్, ఏఎంఓ సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన వారోత్సవాలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం మంగళాపురం ఎంపీపీ స్కూల్లో గురువారం అతిథి దేవో భవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్ర పటానికి హెచ్ఎం రామలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు, నిశ్శబ్ద యోగ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సంస్థ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. పేద విద్యార్థులకు వస్త్ర దానం చేశారు. గత ఏడాది సంస్థ నిర్వహించిన నెలవారి కార్యక్రమాలు, సహకరించిన దాతల పేర్లతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-కశింకోట : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అనకాపల్లి జిల్లా సత్యసాయి మండలి అధ్యక్షులు ఎస్.శంకర్‌రావు అన్నారు. మండలంలోని తాళ్ళపాలెం భజన మండలి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ ముగింపు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్ద ఉండి టైలరింగ్ చేసి ఇల్లు చక్క దిద్ది వచ్చని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి రాజశేఖర్, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎరుకురెడ్డిపాలెం గ్రామంలో గురువారం హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు 26 మంది పాడి రైతులకు సంక్రాంతి బోనస్ ఒక లక్ష 55 వేల రూపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అప్పారావు, రత్నం, పెంటారావు, అప్పలరాజు, నర్సింగరావు, పైడిరాజు, నాగరాజు పాల్గొన్నారు.

బోనస్‌లు అందిస్తున్న హెరిటేజ్ మేనేజర్ శేషు

రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విశాఖ డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. విశాఖ డెయిరీ ద్వారా పాడి రైతులకు సంక్రాంతి నగదు బదిలీ కార్యక్రమం మండలంలోని కొమ్మల్లపూడిలో గురువారం నిర్వహించారు. కొమ్మల్లపూడి బల్క్ కూలర్ ఏరియాలో గల పాడి రైతులకు రూ.5కోట్ల 64 లక్షల చెక్కులను ఎమ్మెల్యేతో పాటు విశాఖ డెయిరీ డైరెక్టర్లు పిల్లా రమాకుమారి, గేదెల సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ డెయిరీ మాజీ చైర్మన్ ఆడారి తులసీరావు పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. డైరెక్టర్ రమాకుమారి మాట్లాడుతూ రైతులు అధిక లాభాలు సాధించాలంటే గేదెల పెంపకం చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కోళ్ళ కాటమయ్య, మాజీ డైరెక్టర్ మలసాల రమణారావు, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, ఎంవి సత్యనారాయణ, ముచ్చకర్ల తాతీలు, దొంకిన అప్పలనాయుడు, కోట సత్యనారాయణ, దొండ నరేష్, దొండ సన్యాసిరావు, పాల సంఘాల డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ, వాడ చీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రెండు పిహెచ్‌సిల ఆసుపత్రి అభివృద్ధి కమిటీల సమావేశం సంయుక్తంగా ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏ విధమైన అసౌకర్యాలు చూడాలన్నారు. ఆసుపత్రికి కిటికీలు మెస్సలు, తలుపులకు రిపేర్లు, బయో మెడికల్ వేస్టేజ్ కవర్స్, ఓపి స్లిప్స్ ప్రింటింగ్, మొదలుగునవి కొనుగోలు చేయాలని సూచించారు. ఆసుపత్రికి ఏ వ్యాధితో ఎక్కువ మంది వస్తున్నారో దాని తగ్గట్లు మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో భరణికం సర్పంచ్ కె.పూజ శేఖర్, ఎమ్మార్వో ఎస్వి.అంబేద్కర్, డాక్టర్ పి.హారిక, డాక్టర్ జయశ్రీ కరిష్మా, డాక్టర్ క్రాంతి కుమార్, ఆశలు, స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకట పద్మలక్ష్మి

టిటిడి చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్లు కౌంటర్ల వద్ద జరిగిన తొక్కిసలాటకు బాధ్యులైన టీటీడీ చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ద రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశికి ద్వాదశికి లక్షలాదిమంది భక్తులు తిరుపతికి విచ్చేస్తారని, అలాంటి భక్తులకు ఆ రెండు రోజులు ఉచిత దర్శనం ఏర్పాటు చేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. కాని నేడు పాలకమండలి టోకెన్ లేనిదే దర్శనం లేదని వారం రోజులుగా ప్రచారం చేయడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందని పేర్కొన్నారు. ఇందులో చనిపోయిన కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం టిటిడి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి

తిరుమల తిరుపతి వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల కౌంటర్ వద్ద తొక్కులాటలో మృతి చెందిన భక్తుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైకుంఠ దర్శనానికి భక్తులు వస్తారని తెలిసి కూడా తగిన ఏర్పాట్లు చేయడంలో టీటీడీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారని ఆరోపించారు. జరిగిన సంఘటనపై సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-వడ్డాది : గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామపంచాయతీ పరిధిలో 42 ఇంగిడి గుంతలను గురువారం నిర్మించారు. ఎన్ఆర్జిఎస్ పథకంలో భాగంగా గ్రామానికి 42 ఇంకుడు గుంతలను ఏర్పాటుకు గుర్తించామని చెప్పారు. మరికొన్ని ఇంకుడు గుంతలు ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇంట్లో వాడకనీరు బయటికి పోవడానికి మార్గం లేని వారు ఇంకుడు గుంతల వల్ల ప్రయోజనం పొందవచ్చని చెప్పారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులు కచ్చితంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి, విశాఖ సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన విధంగా ఈ నెల 10 నుండి 19 వరకు అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో అన్ని యాజమాన్యాల పాఠశాలలు సంక్రాంతి సెలవులు పక్కగా అమలు చేయాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తమ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే వీటిపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్లు ఆధారాలతో పాటు తమ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. అటువంటి పాఠశాలలపై ఆయా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆధారాలతో ఫిర్యాదులు అందితే చట్ట ప్రకారం చర్యలకు వివిధ సిఫారసులు చేసేందుకు తమ కమిషన్ సిద్ధంగా ఉందని, ఫిర్యాదులు apscpcr2018@gmail.com మెయిల్ పంపాలని కోరారు.

దేవాలయానికి మైక్, స్పీకర్లు వితరణ

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని జంపపాలెం దేవాలయాల్లో పూజలు, వ్రతాలు, సుప్రభాతం మొదలైన అన్ని దైవ కార్యకలాపాల నిమిత్తం 8 మైక్‌లు, స్పీకర్లను కీర్తిశేషులు వెలగా నేస్తాలమ్మ జ్ఞాపకార్థం వారి కూతురు కొడుకు యల్లపు రామప్పలనాయుడు వితరణ చేశారు. గురువారం దేవస్థానం వద్ద పెద్దల సమక్షంలో రూ.18,000 విలువచేసే వస్తువుల్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవకినాయుడు, మాజీ సర్పంచ్ యల్లపు శ్రీరాములు, దేవస్థానం చైర్మన్ జగన్మోహనరావు, పెద్దలు పొలిమేర రాము, ఆళ్ల సోమునాయుడు, కర్రి అప్పన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాసులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడి ఎంపిపి స్కూల్లో విద్యార్థులకు డిజిటల్ క్లాసులు ప్రారంభమయ్యాయి. గురువారం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్ పెద్దాడ నాయుడు సంయుక్తంగా రెండు టీవీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలన్నారు. ఎస్ఎంసి చైర్మన్ సరస్వతి, వైస్ చైర్మన్ జ్యోతి, హెచ్ఎం కె శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లాంఛనంగా చెరుకు తూనిక ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని అలమండ భీమవరం చెరుకు కాటా వద్ద గురువారం ఉదయం తూనికను గ్రామ సర్పంచ్ తర్రా సన్యాసమ్మ శేషు, కాటా అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరుకు కాటా వ్యవసాయ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ చెరకు మద్దతు ధర 2024-2025 సంవత్సరానికి టన్నుకు రూ.3,151ల చొప్పున నిర్ణయించినట్లు చెప్పారు. పేమెంట్స్ నేరుగా రైతు అకౌంట్లో వేస్తారన్నారు. ప్రస్తుతం చెరకు తోలుతున్న రైతుకు అడ్వాన్స్ పేమెంట్‌గా టన్నుకు రూ.2,600 ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌మెన్ పైడిరాజు, సిబ్బంది, రైతులు ఎలిశెట్టి ఈశ్వరరావు, కర్రి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

చెరుకు కాటా వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్ తదితరులు

బల్క్ డ్రగ్ పార్క్ వద్దు

పలు గ్రామాల ప్రజలు నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట ప్రాంతంలో పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే బల్క్ (డ్రగ్స్) పార్క్ ఏర్పాటు చేయవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. రాజయ్యపేటలో గురువారం మత్స్యకారులతో కలిసి మాట్లాడారు. విశాఖపట్నంలో బుధవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రాజయ్యపేట, పాటిమీద, తమ్మయ్యపేట తదితర గ్రామాల్లో పెద్ద సంఖ్యలో జనం నిరసన తెలియజేశారు. ప్రజల మనోభావాలు, అభిప్రాయం, ప్రజా ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని ప్రమాదకరమైన బల్క్ డ్రగ్ పార్క్ ఎట్టి పరిస్థితులను ఏర్పాటు చేయకూడదని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులు, మత్స్యకారులు, కళ్ళుగీత కార్మికులు, దళితులు, కూలీలు బల్క్ (డ్రగ్స్) పార్క్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇప్పటికే ఏర్పడిన హెటిరో డ్రగ్స్ రసాయన కంపెనీతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మరో బల్క్ డ్రగ్స్ తీసుకొచ్చి ఈ ప్రాంత ప్రజానీకం ఆరోగ్యాలు, ప్రాణాలు మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీయడానికి ప్రభుత్వం పూనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. విశాఖపట్నంలో బుధవారం జరిగినటువంటి ప్రధానమంత్రి సభకు రాజయ్య పేట సమీపంలో ఎల్ఈడీ స్క్రీన్లతో ఏర్పాటు చేసినటువంటి సభకు స్థానిక గ్రామాల ప్రజలు వెళ్లకుండా బాయ్ కట్ చేసి గ్రామాల్లో నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు పునరాలోచించి బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం. రాజేష్, సిపిఎం రాజయ్యపేట శాఖ కార్యదర్శి ఎం. మహేష్ బాబు, నాయకులు బైరాగిరాజు, బాపూజీ, సోమేశ్వరరావు, భూలోక, తాతాజీ, రాజు, రాజన్న, జగదీష్, కాశి రావు, చంటి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలరాజు

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ప్రతికూలికి రోజుకు 300 రూపాయలు వచ్చే విధంగా పని కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో గురువారం నక్కపల్లి, ఎస్ రాయవరం, పాయకరావుపేట మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మార్కింగ్ చేసే విధానాన్ని సాంకేతిక సిబ్బంది ద్వారా అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడి డి ఎరకయ్య, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల ఏపీవోలు భాగ్యలత, నాని బాబు, ఈ సి లు,టి ఏ లు,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

మాడుగుల:జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు దినసరి వేతనం 300 రూపాయలు వచ్చే విధంగా వివరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించడం జరిగిందని ఏపీడి బండారు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాడుగుల, చీడికాడ, బుచ్చియ్యపేట మండలాల సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలు చేసే పనికి కొలతలు వేసే సాంకేతిక శిక్షణను పూర్తిస్థాయిలో అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు మురళీకృష్ణ, వరహాలు బాబు, గంగునాయుడు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామంలో చేతిబోరు పనులను ఎంపీపీ యర్రంశెట్టి పాపారావు గురువారం ప్రారంభించారు. శ్మశాన వాటిక సిమెంట్ రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాము తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ గ్రామంలో శ్మశానానికి వెళ్లే దారిలో బోర్ వెల్ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కొసెపల్లి అప్పారావు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ నిధుల నుండి ఈ బోర్‌వెల్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ కే.లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ గండం ఈశ్వరరావు, కస్తూరిబా స్కూల్ చైర్మన్ కుందేటి పట్టాలు, ఏఐఎం పొలిట్ బ్యూరో సభ్యులు సరమండ వీరబాబు, సీనియర్ నాయకులు బొర్రా రాజబాబు, కొమరవోలు చిన్న చిట్టిబాబు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

పరామర్శిస్తున్న ఐద్వా మహిళలు

ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతల పరామర్శ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అత్తింటి వారి దాడిలో గాయ పడి స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న నాతవరం మండలం వైబి పట్నానికి చెందిన పైల వసంతను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సభ్యులు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, ట్రెజరర్ కెవి సూర్యప్రభ గురువారం పరామర్శించారు.తన భర్త మరణించాడని సంక్రాంతికి బట్టలు పెట్టడానికి అత్తింటికి వెళితే రెండురోజులు ఇంటిలోకి రానివ్వకుండా గేటు వద్ద ఆపేయడంతో చలిలో తిండి లేకుండా ఉన్నానని, మరుసటి రోజు తెల్లవారుజామున అత్తమామలు, ఆడపడుచు, వారి పిల్లలు కొట్టారని బాధితురాలు వసంత తెలియజేసింది. ఐద్వా నాయకులు మాట్లాడుతూ, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వసంతకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే వసంత తరుపున ఐద్వా పోరాడుతుందన్నారు.

బాలికకు పరామర్శ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :వేములపూడి కేజీబీవీ పాఠశాలలో ఆహారం తిని అస్వస్థకు గురైన బాలికను గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేములపూడిలో కేజీబీవీ లో ఫుడ్ పాయిజన్ అయి ఏడుగురు విద్యార్థినిలు అస్వస్థకు గుర్యయ్యారన్నారు. వీరికి మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ , ఐద్వా నాయకురాలు సత్య ప్రభ కోరారు. ప్రభుత్వ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ తరచూ జరుగుతున్నాయని కొద్దిరోజుల క్రితం కైలాస పట్టణంలో జరిగిన సంఘటన మరవకముందే మరో సంఘటన కేజీబీవీలో జరగడం బాధాకరమన్నారు. కుళ్ళిన, పాడైపోయిన పదార్థాలు విద్యార్థులకు పెట్టడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జి గౌతమ్, పి.కృపానంద్, పి.విజయ్, ఐద్వా నాయకురాలు గౌరీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గొలుగొండ:అనారోగ్యంతోమృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న లక్కోజు అప్పలాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అతని స్నేహితుడు పి.సత్యనారాయణ, ఎల్.అప్పలనాయుడు, రమేశ్, నాగేంద్ర తదితరులు రూ.40వేలు సేకరించి ఆ నగదును మృతుడి పిల్లల పేరున డిపాజిట్ చేశారు.

చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి -రావికమతం: ఇటీవల కాలంగా నిర్వహించిన గృహ సర్వేలో బతికి ఉన్న వారిని సైతం చనిపోయినట్లు నమోదు చేయడం పట్ల ఎంపీడీవో వెంకన్న బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ సర్వేలో చనిపోయినట్లు చూపించిన వ్యక్తులు పెన్షన్లు ఏ విధంగా పొందుతున్నారని ప్రశ్నించారు. తక్షణం ప్రతి ఇంటింటికి వెళ్లి గృహ సర్వేలో చోటు చేసుకున్న తప్పులను సవరించాలన్నారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే నిర్ణీత కాలములో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకపై లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్డి భానోజీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండల యుటిఎఫ్ డైరీ, అధ్యాపక దర్శిని, క్యాలెండర్లను మండల విద్యాశాఖాధికారులు ఆవిష్కరించారు. మండలంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కళింగ సతీష్, ప్రధాన కార్యదర్శి యు.నాగభూషణం, గౌరవ అధ్యక్షులు కే.కేశవరావు, సహాధ్యక్షులు బి.భారతి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నర్సీపట్నం టౌన్ ఎస్ఐ రమేష్, స్కూల్ ప్రిన్సిపల్ రూప ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హెట్రో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ (నక్కపల్లి) సహకారంతో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎస్సై మాట్లాడుతూ, తన చిన్నతనంలో శ్రీకాకుళం జిల్లా గవర్నమెంట్ స్కూల్లో చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని, మీరందరూ కూడా బాగా చదువుకుని ఉన్నతమైన స్థానంలోకి రావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం రూప, పేరెంట్స్ కమిటీ సభ్యులు రాంబాబు, సత్తిబాబు, రాజు పాల్గొన్నారు

మెటీరియల్ ఇస్తున్న ఎస్ఐ

దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ సాయం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నిరుపేద, తల్లి లేదా తండ్రి లేని 20 మంది విద్యార్థులకు సంక్రాంతి సందర్భంగా దుస్తులు కోసం బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ అందజేసింది. ఈ మేరకు హెచ్ఎం మూర్తి రాజు మాట్లాడుతూ బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి చాంద్ పాషా 20 మంది విద్యార్థులకు సంక్రాంతి కి బట్టలు కొనుక్కోవడానికి 18000 రూపాయలు, నెల్లిపూడికి చెందిన ఆటిజం విద్యార్థికి ఎస్కార్ట్ అలవెన్సు గా 2 వేలు మొత్తం 20 వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. వాటితో దుస్తులు కొనుగోలు చేసే విద్యార్థులకు అందించమన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి సివిల్ ఇంజినీర్ సత్యమోహన్, ఉపాధ్యాయులు రత్నకళ, మోహనరావు, రాజేష్, గోవిందరావు, గుర్నాధం పాల్గొన్నారు.

చెరువు సరిహద్దులు గుర్తింపు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో గొంప మిరియాల చెరువు ఆక్రమణకు గురి కాకుండా గురువారం రెవెన్యూ పోలీసు, సర్వే సిబ్బంది గ్రామ పెద్దల సమక్షంలో హద్దులు నిర్ణయించి జెండాలను పాతారు. ఈ చెరువును గత మూడేళ్ల క్రితం నుంచి సుమారు 20 మంది దర్జాగా ఆక్రమించుకొని పంటలు పండించుకుంటున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవిన్యూ అధికారులు, సర్వే యంత్రాంగం క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారణ చేసిన పిమ్మట చెరువు ఆక్రమణదారులు అందరికి ముందుగా నోటీసులు ఇచ్చామని, దీని నుంచి వైదొలగాలని తహసీల్దార్ బి వెంకటరమణ తెలిపారు.. వైదొలగకుంటే ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, విఆర్వో అప్పారావు, ఎఎస్ఐ అప్పారావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆందోళనకారులపై కేసులు

ప్రజాశక్తి -నక్కపల్లి:విశాఖలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన ఏర్పాటుకు వ్యతిరేకంగా మండలంలోని రాజయ్యపేటలో ధర్నా చేసిన సిపిఎం నాయకులు, గ్రామస్తులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, వీరిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ ఐ సన్నిబాబు గురువారం తెలిపారు. 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసామని విచారణలో మరికొంతమందిని గుర్తించడం జరుగుతుందని వెల్లడించారు.

వెల్లువెత్తిన నిరసనలు

విశాఖ స్టీల్‌పై ప్రస్తావించని మోడీ, చంద్రబాబు, పవన్‌పైనా, అనకాపల్లి జిల్లాలో నిర్బంధాలపైనా ఆగ్రహ జ్వాలలు

ఉక్కునగరంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న మహిళలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని, సెయిల్‌లో విలీనం చేస్తామని గానీ నరేంద్రమోడీ కనీసం ప్రస్తావించకపోవడాన్ని, వ్యతిరేకిస్తూ విశాఖలో గురువారం సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు వెల్లువెత్తాయి.

విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రాయూనివర్శిటీలో బుధవారం జరిగిన సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోడీతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగిస్తామని ప్రకటన చేయించాలని డిమాండ్ చేస్తూ మద్దిలపాలెంలో వామపక్ష పార్టీలు నిరసన తెలియజేస్తే అక్రమ అరెస్టులకు పూనుకోవడాన్ని, మోడీ విశాఖకు మరోసారి ద్రోహం చేయడాన్ని ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన జగదాంబ జంక్షన్ నుంచి క్లాక్ సర్కిల్ మీదుగా లేపాక్షి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. తిరిగి జగదాంబ జంక్షన్‌కు వచ్చి నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు సిహెచ్.దేవా మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కును రక్షిస్తామన్న చంద్రబాబు, పవన్‌లు నేడు అధికారంలోకి వచ్చాక ఆ హామీ ఎమైందని ప్రశ్నించారు. గాజువాక ఎమ్మెల్యేను, విశాఖ ఎంపీని అత్యధిక మెజార్టీతో గెలిపించిన విశాఖ ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా టిడిపి, జనసేన వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మోడీని పొగడటానికి సభ పెట్టారు తప్ప విశాఖకు ఎటువంటి మేలూ లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కంటే, అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయబోయే ప్రైవేట్ ఆర్సీలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని, ఎటువంటి ఆటంకాలు లేకుండా అనుమతులు ఇవ్వాలని కోరడటంపైనే మక్కువ ఉందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న విశాఖస్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా అమ్మేయడానికి మోడీకి నేరుగా సహకరించడం తప్ప మరొకటి కాదన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, బి.జగన్, వి.కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎస్‌ఎ.రెహ్మాన్, క్షేత్రపాల్‌రెడ్డి, ఎం.మన్మధరావు, సిపిఎం, సిపిఐ నాయకులు ఎమ్‌డి బేగం, యుఎస్‌ఎన్.రాజు, యు.రాజు, టి.నూకరాజు, వి.నరేంద్రకుమార్, పి.వెంకటరావు, జెడి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్రోహపూరిత వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిరసన ప్రదర్శన జరిగింది 78 వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రధాని మోడీ బహిరంగ సభలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం, సొంత గనులు ఇస్తున్నట్టు ప్రకటిస్తారని ఎదురుచూసిన స్టీల్ కార్మికులతో పాటు రాష్ట్ర ప్రజానీకానికి నిరాశే మిగలిందన్నారు. మాట మాత్రమైనా దీన్ని ప్రస్తావించకపోవడం రాష్ట్రానికి ద్రోహం చేసినట్టేనన్నారు. .స్టీల్‌జోన్ కార్యదర్శి శ్రీనివాస్ రాజు, సిపిఎం నాయకులు వైటి. దాస్, యు రామస్వామి, జగ్గారావు, సంతోష్ కుమార్ రాజు, దత్తాత్రేయ రాజు, వివి రమణ, గౌడ్, మహేష్ పాల్గొన్నారు. మహిళలు కొవ్వొత్తులతో నిరసస చేపట్టారు.

గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై ప్రధాని మోడీతోపాటు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నోరెత్తకపోవడాన్ని నిరసిస్తూ పాత గాజువాక జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నల్లజెండాలు పట్టుకుని నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి మణి, ఆర్‌కెఎస్‌వి. కుమార్, గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, జోన్ కమిటీ నాయకులు ఎ.లోకేష్ కె.సంతోషం కామేశ్వరి, ఎం శ్రీదేవి, గొలగాని అప్పారావు, పి లక్ష్మణస్వామి, ఎం రాజేంద్రప్రసాద్, కె.సుబ్బన్న, జయశ్రీలక్ష్మి, జె. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో

పెదగంట్యాడలో. సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు. డి వెంకటరావు, నాయకులు. బైరెడ్డి గురప్ప. జి శ్రీనివాసరావు. నమ్మి రమణ. సి హెచ్ రాముడు. బి సింహాచలం బి ఆనంద్. ఎ శ్రీను,. సిహెచ్ పైడిరాజు, బండి అప్పలరాజు, వెంకటరావు. శ్రీనివాస రెడ్డి.పాల్గొన్నారు.

మధురవాడ : విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం కపట నాటకాన్ని నిరసిస్తూ మధురవాడ మార్కెట్ కూడలి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. నగరం పాలెం రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించి, సేవా రహదారిపై రాస్తారోకో చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి అప్పలరాజు, సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజు కుమార్, కార్యకర్తలు ఎ.గురుమూర్తి రెడ్డి, డి. రవి,ఎస్ రామప్పడు, వి గోవింద, బి రాంబాబు, గోపి, ఎన్ బంగార్రాజు,కే సంతోష్ పాల్గొన్నారు

పెందుర్తి : సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సుజాతనగర్ జంక్షన్‌లో నల్ల బ్యానర్‌తో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం గోపాల పట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సాక్షిగా ప్రధాని మోడీ విశాఖకు మరోమారు ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు జి శంకరరావు, జక్కన్న, సత్యనారాయణ, కె.అప్పలనాయుడు సూర్య ప్రకాష్, నాయకులు ప్రభుదేవా, ఎం రాజు, ముత్యాలమ్మ, అప్పల నరసమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు

సీతమ్మధార : మోడి బహిరంగ సభలో కూటమి పాలకుల తీరును నిరసిస్తూ తాటిచెట్లపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు యుఎస్ఎన్ రాజు, కంచరపాలెం జోన్ కమిటీ నాయకులు గౌరీష్, విద్యార్థి సంఘ నాయకుల కుసుమ, కోటయ్య, కన్నయ్య, సూర్య కుమారి పాల్గొన్నారు.

ములగాడ: విశాఖ స్టీల్ ప్లాంట్ సొంత గనుల కేటాయించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ, దీనిపై ప్రధాని మోడీ, కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడ్రాజు, జోన్ నాయకులు కె. రమణ, రాంబాబు, సూరిబాబు, రాము, బి అప్పారావు, అప్పలనాయుడు, సత్యారావు, శ్రీను కుమార్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వినాశకారిగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని, ఆయనకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వంతపాడడం ప్రజలను మోసం చేయడమేనని సిపిఎం నేతలు ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై ఊసెత్తని కూటమి నేతల తీరును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కంచరపాలెంపార్టీ కార్యాలయం నుంచి నుండి ఊర్వశి జంక్షన్ వరకు పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జోన్ సెక్రటరీ బొట్టా ఈశ్వరమ్మ, జోన్ నాయకులు ఒ అప్పారావు, ఎమ్ ఈశ్వరరావు, ఎస్ సోమేశ్వరరావు, మోహన్ రావు, టి చిట్టిబాబు, కుమారమ్మ, సత్య, భానుమూర్తి, శ్రీను, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో నిరసన చేపడుతున్న కోటేశ్వరరావు, నేతలు

నిర్బంధాలపై నిరసనలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

విశాఖలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పూనుకోవడంపై గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. సిపిఎం ఆధ్వర్యాన పలు చోట్ల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి : ప్రధాని పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సిపిఎం నాయకుల హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు, నక్కపల్లిలో కాలుష్యకారక బల్క్ డ్రగ్ పరిశ్రమలు వద్దని ఆందోళన చేసిన రాజయ్యపేట గ్రామస్తులపై పోలీసులు నిర్బంధాన్ని నిరసిస్తూ గురువారం అనకాపల్లి ఆర్డీఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నక్కపల్లిలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు సేకరించిన నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా, ఆ భూముల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. విదేశాల్లో నిషేధించిన కాలుష్య పరిశ్రమలను నక్కపల్లిలో పెట్టొద్దని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా.. పట్టించుకోకుండా ప్రైవేట్ వ్యక్తులకు లాభాలు కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ ఏర్పాటుకు శంకుస్థాపన చేశాయని పేర్కొన్నారు. తక్షణమే బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రజల మనోభావాలను ఏమాత్రం గౌరవించకుండా మరోసారి మోసం చేశారన్నారు. విశాఖ ఉక్కును కాపాడి తీరుతామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ వేదిక నుండి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరకపోవడం దుర్మార్గమన్నారు. పైగా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ గురించి చంద్రబాబు విన్నపాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పాంగి చలపతి, బి.నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కసింకోట మండలం తాళ్లపాలెంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాని మోడీ విశాఖ పర్యటన సందర్భం నిర్బంధాలు, అక్రమ అరెస్టులపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, కార్మికులు జి.అప్పారావు, సన్యాసినాయుడు, బెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : పోలీసు నిర్బంధంపై మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి, ముఠా కార్మికులు బర్ల రమణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అచ్చుతాపురం : గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులపై అచ్చుతాపురంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ పూడిమడక ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ 1200 ఎకరాల్లో భూములు కోల్పోయిన నిర్వాసితుల మత్స్యకారులకు శాశ్వత ఉపాధి కల్పనకు ఎటువంటి హామీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సోము నాయుడు, తట్టా రాజు, గణేష్, వెంకట్, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : ప్రభుత్వ, పోలీసు నిర్బంధ చర్యలపై రైతు సంఘం, సిఐటియు, ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు సత్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, నాయకులు కూర్మారావు, రామనాయుడు, చిరంజీవి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, నాయకులు శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ సభ నేపథ్యంలో సిపిఎం నాయకుల పై గృహ నిర్బందాన్ని ఖండిస్తూ గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద గాంధీజీ విగ్రహం వద్ద ఆ పార్టీ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సబ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ, విశాఖకు ప్రధాన మంత్రి మోడీ వచ్చిన సందర్భంగా ముందురోజు ఆర్ధరాత్రి నుండి సిపిఎం నాయకులను పోలీసులు గృహ నిర్బందం చేశారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన మాటలు టిడిపి, జనసేన పార్టీల నేతలు ఆదికారం చేపట్టాక మర్చి పోయినట్టున్నారని విమర్శించారు. నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరన్నారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీలను మోడి పట్టించుకొలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకలు ఎల్ గౌరి, కెవి సూర్యప్రభ, కె రామకృష్ణ, రమణ, సాంబ, రాము, అప్పారావులు పాల్గొన్నారు.

ఎస్ రాయవరం: దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా సిపిఎం నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడంపై సిపిఎం జిల్లా నాయకులు ఎం సత్యనారాయణ ఖండించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం అడ్డురోడ్డు సెంటలో నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ కంపెనీ నిలుపుదల చేయాలని పోరాటం చేసిన సిపిఎం నాయకులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాంబాబు, రాజు, అర్జున, చంటి రామారావు, వెంకటరమణ, నాగు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

వంతెన మరమ్మతుకు రూ.50 లక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల:పాములవాక గ్రామంలో ఏలేరు కాలువపై ఇటీవల కాలంలో రైతుల సౌకర్యార్థం నిర్మించిన వంతెన నిర్మాణంలో డిజైను కారణంగా తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు 50 లక్షలు మంజూరు అయినట్లు టిడిపి సీనియర్ నాయకులు భాస్కరరావు తెలిపారు, ఇటీవల సమస్య పరిష్కారం కోసం జీవీఎంసీ ఎస్ఈ మురళీకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు, అదేవిధంగా మంత్రి వంగలపూడి అనితకు సమస్యను విన్నవించడంతో స్పందించిన మంత్రి నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారు ఆ మేరకు ఈనెల 17న టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేత భాస్కర్ రావు

విద్యార్థులకు కంచాలు వితరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన దాత రామరాజు లక్ష్మీ పతిరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కంచాలు, గ్లాసులు గురువారం వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు కొండయ్య తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేయుటకు గాను పది వేల విలువ గల అరవై కంచాలు, అరవై గ్లాసులు వితరణగా అందించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి నాగ అప్పారావు, వైస్ చైర్మన్ చొప్పా రమ్య, ఉపాధ్యాయిని పి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

కంచాలు ఇస్తున్న చైర్మన్, ఉపాధ్యాయులు